
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

రారండోయ్ !
వాహనాలపై దసరా ఆఫర్ల జోరు
-7లో

సర్దుబాటు!



కాంట్రాక్టర్ల బకాయిలపై కూటమి ప్రభుత్వం దృష్టి

- ఒక్కొక్కరుగా బయటపడుతున్న కాంట్రాక్టర్లు
- నీరు-చెట్టు బిల్లుల చెల్లింపు కొనసాగింపు
- పెండింగ్‌లోనే రూ.40 కోట్లకు పైబడి..
- ఆర్‌అండ్‌బీలో రూ.140 కోట్ల బకాయిలు
- ఇప్పుడు మరమ్మతుల వైపు తొంగి చూడని కాంట్రాక్టర్లు
- పాత బకాయిలు కొంత చెల్లిస్తేనే ముందుకు.. ఆర్‌అండ్‌బీకి సరికొత్త సవాళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా సర్దుబాటు ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. గడిచిన ఐదేళ్ల పాటు ఎన్నడూ లేని విధంగా శాఖల్లో నిర్వీర్యం, బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం తొంగి చూసింది. వందలాది మంది ఆర్థికంగా నలిగిపోయారు. మరి కొందరు వడ్డీలు చెల్లించలేక మకాం మార్చాల్సిన పరిస్థితులు. కేవలం రాజకీయ కారణాలతోనే సామాజికపరంగా కొందరిపై కక్ష కట్టి వ్యవహరించారు. సర్కారు వైఖరిపై కొందరు బాధితులు కోర్టులకెక్కారు. న్యాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు. ఆర్‌అండ్‌బీ శాఖలో రోడ్ల పనులు చేసిన కాంట్రాక్టర్లకు చివరి క్షణంలో మొండిచేయి చూపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వీరందరికీ కొంతలో కొంత సర్దుబాటు చేసేందుకు వరుస క్రమంలో చర్యలు చేపట్టింది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆర్‌అండ్‌బీలో 140 కోట్లు పెండింగ్

ఆర్‌అండ్‌బీ శాఖలో ఒక్క ఏలూరు జిల్లా పరిధిలోనే వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు గడిచిన వైసీపీ ప్రభుత్వం రూ.140 కోట్లను బకాయి పెట్టింది. కనీసం కొంతలో కొంతైనా తమ పెండింగ్ బిల్లుల సొమ్ములను మంజూరు చేయాలని నెత్తి నోరు కొట్టుకున్నా ఇన్నాళ్లు వైసీపీది డోంట్‌కేర్. గడిచిన ఐదేళ్లల్లో ఎక్కడికక్కడ రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. కొత్తరోడ్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోయినా స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు జోక్యం చేసుకుని మరీ కాంట్రాక్టర్లతో కొన్ని పనులు పూర్తి చేయించేందుకు ప్రయత్నించారు. ఏలూరు-కైకలూరు మధ్య కొల్లేరు భాగంలో రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్లు తిప్పలు పడ్డారు. అయితే బిల్లుల విషయంలో చేదు అనుభవం ఎదురైంది. ప్రస్తుతం ఆ పని పూర్తి చేయగలిగారుగాని బిల్లులు మాత్రం ఎక్కడికక్కడే. ఇలా ఒకటేంటి అన్ని పనులకు వైసీపీ ప్రభుత్వంలో ఇదే పద్ధతి పాటించారు. తాజాగా కూటమి ప్రభుత్వమైనా కొంత తమ డిమాండ్‌కు సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావంతో కాంట్రాక్టర్లు ఉన్నారు. దీనికితోడు రద్దీ మార్గాలతోపాటు మరికొన్ని మార్గాల్లో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లకు రాబోయే వంద రోజుల్లోనే మరమ్మతులు చేయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రూ.21 కోట్లను మంజూరు చేసింది. తీరా పాత బకాయిలు రాక, ఇప్పుడు కొత్తగా వచ్చిన పనులు కూడా చేస్తే ఆ బిల్లులు కూడా ఇస్తారో.. ఇవ్వరో తెలియక చాలా మంది కాంట్రాక్టర్లు వెనకడుగులో ఉన్నారు. ప్రభుత్వం వంద రోజుల వ్యవధిలోనే మరమ్మతు పనులు పూర్తి కావాల్సిందేనని పట్టుపడుతోంది. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ సరికొత్త సవాల్‌ను ఎదుర్కొంటుంది.

నీరు-చెట్టు బిల్లుల చెల్లింపు

నీరు-చెట్టు పథకం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భారీగా పనులు చేయించింది. అప్పట్లో ప్రభుత్వం చివరి దశలో ఉండగా ఈ పనులన్నీ శరవేగంగా సాగాయి. ఎప్పుడైతే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి ఈ పథకానికి చెల్లింపులు జరపకుండా నిలిపివేసింది. జిల్లాలో దాదాపు 70-80 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. వీరిలో కొంత మంది కోర్టును ఆశ్రయించగా బిల్లులు చెల్లించాల్సిందేనని కోర్టు ఆదేశించింది. అయితే కేవలం కొంతమందికి చెల్లించి మరికొంతమందికి త్వరలో చెల్లిస్తామని చెప్పి కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎవరైతే కోర్టును ఆశ్రయించారో వారందరినీ గుర్తించి బిల్లుల చెల్లింపుల ప్రక్రియను వేగిరం చేసింది. గడిచిన వంద రోజుల్లో రూ.20 కోట్లకు పైగానే చెల్లింపులు చేసింది. కోర్టులకు ఎక్కకుండా బిల్లులు ఎప్పుడొస్తాయని ఎదురు చూస్తున్న వారికి ఇంకా 40-50 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటిని దఫాల వారీగా చెల్లించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇలా అనేక పథకాలకు ఎక్కడైతే పెండింగ్ ఆక్షేపణ ఉంటుందో.. సమాంతరంగా ఆయా శాఖలపై తీవ్ర ప్రభావం చూపుతుందో ఆ వైపు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. సాధ్యమైనంత మేర బిల్లులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తోంది. గడిచిన ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థను ఓ గాడిన పెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఇంకోవైపు సర్దుబాటును కొనసాగిస్తోంది.



- భవతీ భిక్షాం దేహి.. కాశీ అన్నపూర్ణేశ్వరి

జిల్లాలో దేవీ నవరాత్రులు ఘనంగా సాగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముసునూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని చిత్రంలో చూడవచ్చు.

పుట్టా..పట్టు పక్కా!



- నూజివీడు స్టేషన్‌కు ఆధునిక వసతులు
- ఏలూరులోను కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్
- కొవ్వూరు-భద్రాచలం లైన్ పూర్తి చేయాల్సిందే
- నా విన్నపాలపై చర్యలు తీసుకోండి..
- రైల్వే సమీక్షలో పట్టుబట్టిన ఎంపీ మహేశ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కొత్తగా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ గడిచిన నాలుగు నెలల్లోనే ఢిల్లీలో తన సత్తా చూపించి.. కేంద్ర మంత్రులను ఒప్పించి వినూత్నంగా అందరికీ మేలు చేకూరేలా పథకాలు సాధించారు. గడిచిన ఐదేళ్లలో ఏలూరుకు ఎలాంటి కేంద్ర వరాలు లేకుండా పోయాయి. కాని పుట్టా ఆ లోటును కొద్దికాలంలోనే భర్తీ చేయడం ఆరంభించారు. ఎంపీగా మంచి మెజార్టీతో తనను గెలిపించిన ప్రజల ఆశలు, నమ్మకాన్ని వమ్ము చేయబోనన్న హామీని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే ప్రత్యేకంగా రైళ్లపై దృష్టి నిలిపారు. కేంద్రస్థాయిలో రైల్వే మంత్రిత్వ శాఖ కోరినట్టుగా నివేదిక సమర్పించడం, తన నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఫలానా విషయాన్ని ఆమోదించాల్సిందిగా పట్టుపడుతూ వచ్చారు. ఏలూరులో వ్యాపారులు, ఉద్యోగులు, స్థానికులు కోరుకున్నట్టుగానే వందే భారత్ రైలు ఏలూరు స్టేషన్‌లో ఆగేలా రైల్వే ఉన్నతాధికారులను ఒప్పించడంతో రైల్వే ఏలూరులో వందే భారత్ ఒక నిమిషం ఆగేలా ప్రత్యేక స్టాప్ ఇచ్చింది. ఎంపీగా ఎన్నికైన వంద రోజుల వ్యవధిలోనే ఇలాంటి అరుదైన వాగ్దానం నెరవేర్చగలిగారు.



ఏలూరులో ఎక్స్‌ప్రెస్‌ల హాల్ట్

ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే వందే భారత్‌కు హాల్ట్ ఇచ్చినట్టే ఇకముందు కాకినాడ-జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏలూరు స్టేషన్‌లో నిలుపుదల చేయాలని రైల్వే ఉన్నతాధికారులకు ఎంపీ విజ్ఞప్తి చేశారు. రైళ్ళల్లో జనరల్, స్లీపర్ బోగీలను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోను ఈ తరహా చర్యలకు చొరవ తీసుకోవడమే కాకుండా సాధ్యమైనంత త్వరగా ఇవన్నీ అమలులోకి వచ్చేలా చూడాలని రైల్వే శాఖకు విజ్ఞప్తి చేశారు. చాన్నాళ్లుగా సాగుతున్న కొవ్వూరు-భద్రాచలం మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ఏర్పాటు చర్యలను మరింత వేగవంతం చేయాల్సిందిగా ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత బడ్జెట్‌లోనే ఈ లైనుకు కాస్తంత మోక్షం వస్తుందని భావించినా అది సాధ్యం కాలేదు. అయినప్పటికీ ఈ ప్రాంత రైతులకు, పారిశ్రామిక రంగానికి మరింత మేలు చేకూర్చేలా ఈ లైన్‌ను తక్షణం చేపట్టాలని కోరారు.

ఇప్పుడు నూజివీడు వంతు..



నూజివీడు రైల్వేస్టేషన్‌కు ఒక చరిత్ర ఉంది. అలాంటి స్టేషన్‌లో క్రమేపీ సౌకర్యాలు కనుమరుగవుతూ వచ్చాయి. ఈ స్టేషన్‌లో అనేక రైళ్ల హాల్ట్‌లను ఇంతకు ముందే రద్దు చేశారు. దీంతో కేవలం పాసింజర్ రైళ్లకు మాత్రమే ప్రయాణికులు పరిమితమవుతున్నారు. శుక్రవారం తాజాగా రైల్వే ఉన్నతాధికారులు ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో భేటీ అయ్యారు. పలు సమస్యలను చర్చించారు. ఈ అవకాశాన్ని ఎంపీ పుట్టా వినియోగించుకుని నూజివీడు స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నూజివీడు స్టేషన్‌లో గౌతమి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని, ఇదే స్టేషన్‌లో ప్రయాణికుల వెయిటింగ్ హాలు, జనరల్ వెయిటింగ్ హాలు, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ గది, వెయిటింగ్ లాంజ్, ప్లాట్‌ఫాం-1లో నాలుగు పాసింజర్ షెడ్ల నిర్మాణం, ప్లాట్‌ఫాం-2లో మరో నాలుగు పాసింజర్ షెడ్ల నిర్మాణం చేయాలని పట్టుపట్టారు. తాను ఈ మేరకు ప్రజలకు హామీ ఇచ్చానని, తక్షణం కదలాల్సిందేనని రైల్వే శాఖకు విజ్ఞప్తి చేశారు. నూజివీడు స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, బెంచీల ఏర్పాటు, ప్లాట్‌ఫాం-2లో 24 గంటలు పనిచేసేలా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే నూజివీడు రైల్వే స్టేషన్‌లో ఈ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

98 షాపులు.. 480 దరఖాస్తులు

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో 144 మద్యం షాపుల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించనున్నారు. శనివారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా 98 షాపులకు 480 దరఖాస్తులు వచ్చాయి. ఏలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 41 షాపులు ఉండగా ఆరు షాపులకు 24 దరఖాస్తులు వచ్చాయి. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 షాపులకు 110, భీమడోలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 22 షాపులకు 101, పోలవరం ఎక్సైజ్ పరిధిలో 12 షాపులకు 62, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 షాపులు ఉండగా 12 షాపులకు గాను 69, నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 షాపులకు 58 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 11న ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో చలసాని గార్డెన్స్ కల్యాణ మండపంలో లాటరీ విధానంలో కలెక్టర్ పర్యవేక్షణలో డ్రా తీసి అదే రోజు లైసెన్సులను మంజూరు చేస్తారు. 12వ తేదీ నుంచి నూతన షాపులు ప్రారంభం కానున్నాయి.

సెలవులకు ఇళ్లకు పయనం

ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నుంచి 45 ప్రత్యేక బస్సులు

నూజివీడుటౌన్, అక్టోబరు 5: దసరా సెలవులను పురష్కరించుకొని నూజివీడు ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఇళ్ల బాట పట్టారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 8,600 మంది విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌ను అభ్యసిస్తున్నారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ఇవ్వడంతో దాదాపు 45 ప్రత్యేక బస్సుల ను ఏర్పాటు చేసి ఇళ్లకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, చిత్తూరు, తిరుపతి తదితర దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా రైళ్లలో వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి విజయవాడకు సెటిల్ సర్వీసులను ఆర్టీసీ నడిపింది.



సొంతూళ్లకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సుల వద్ద ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఆలస్యంగా భోజనం..

నూజివీడు ట్రిపుల్ ఐటీలో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు శనివారం ఆకలి బాధ తప్పలేదు. మధ్యాహ్నం 12 గంటలకు అందించాల్సిన భోజనం 1.30 అయినా అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మెస్ నిర్వహకులకు వివరణ కోరగా దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులు ఇళ్లకు పయనం అవ్వడంతో విద్యార్థుల హాజరు సంఖ్య అందేసరికి ఆలస్యం అయ్యిందని ఫలితంగా భోజన ఏర్పాట్లలో కొద్దిపాటి ఆలస్యం చోటు చేసుకుందని తెలిపారు.

'టెట్'కు 45 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 5 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు శనివారం ఉదయం 185 మంది అభ్యర్థులకు 159 మంది, మధ్యాహ్నం 185 మందికి 166 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 45 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని వివరించారు.

పీఎం కిసాన్ నిధులు జమ



జిల్లాకు వచ్చిన 18వ విడత నిధులు రూ. 27.04 కోట్లు

జిల్లాలో మండలాల వారీగా పీఎం కిసాన్ నిధులు

మండలం	రైతుల సంఖ్య	జమ అయిన నిధులు
ఆగిరిపల్లి	8,231	1,64,62,000
భీమడోలు	3,428	68,56,000
బుట్టాయిగూడెం	5,855	1,17,10,000
చాట్రాయి	6,262	1,25,24,000
చింతలపూడి	9,382	1,87,64,000
దెందులూరు	4,927	98,54,000
ద్వారకాతిరుమల	6,127	12254,000
ఏలూరు	2,397	47,94,000
గణపవరం	3,822	76,44,000
జంగారెడ్డిగూడెం	6,681	1,33,62,000
జీలుగుమిల్లి	1,803	36,06,000
కైకలూరు	1,131	22,62,000
కలిదిండి	845	16,90,000
కామవరపుకోట	6,983	1,39,66,000
కొయ్యలగూడెం	6,938	1,38,76,000
కుక్కునూరు	1,549	30,98,000
లింగపాలెం	7,231	1,44,62,000
మండవల్లి	1,523	30,46,000
ముదినేపల్లి	4,072	8,144,000
ముసునూరు	6,828	1,37,36,000
నిడమర్రు	2,446	48,92,000
నూజివీడు	7,324	1,46,48,000
పెదపాడు	3,818	76,36,000
పెదవేగి	6,730	1,34,60,000
పోలవరం	4,182	83,64,000
టి నరసాపురం	7,420	1,48,40,000
ఉంగుటూరు	6,537	1,30,74,000
వేలేరుపాడు	689	13,78,000
మొత్తం	1,35,201	27,04,02,000

ఏలూరు సిటీ, అక్టోబరు 5 : జిల్లాలోని రైతులకు ఇది ఒక రకంగా శుభవార్తగానే పేర్కొనవచ్చు. ఈ నెలలో దసరా, దీపావళి పండుగలు ఉండడం, ఈ సమయంలోనే ప్రధాని మంత్రి కిసాన్ యోజన 18వ విడత నిధుల ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు జమ కావటంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. శనివారం మధ్య ప్రదేశ్‌లోని వాషిమ్ నుంచి ఈ నిధులను విడుదల చేశారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని రైతులు వీక్షించడానికి జిల్లాలోని 520 రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాకు సంబంధించి రూ. 27.04 కోట్లు విడుదల అయ్యాయి. ఒక్కొక్క రైతుకు 2వేల రూపాయల చొప్పున ఈ నిధులను విడుదల చేశారు. సార్వా సమయంలో ఈ నిధులు విడుదల కావడంతో వ్యవసాయ పెట్టుబడులకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

ధాన్యం సేకరణలో రైతులకు అసౌకర్యం కలగనీయొద్దు

- జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, అక్టోబరు 5 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని జేసీ ధాత్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి సిబ్బందికి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన శిక్షణలో జేసీ మాట్లాడుతూ.. 'జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా సిబ్బంది శిక్షణలో పొందిన అంశాలతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలి. జిల్లాలో ధాన్యం సేకరణలో పౌర సరఫరాల సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. జిల్లాలోని 250 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తారన్నారు. సంబంధిత కేంద్రాల్లో విధులు నిర్వర్తించే సాంకేతిక సిబ్బంది, ఇతర సిబ్బందికి ధాన్యంలో తేమ శాతం లెక్కించడం, ధాన్యం తూకం, వాహనాల ద్వారా రైస్ మిల్లులకు పంపడం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, తదితర సిబ్బందికి టీసీ ఎస్ సంస్థ ద్వారా సాంకేతికపరమైన శిక్షణ అందించా రన్నారు. ఈ సందర్భంగా తేమ శాతం కొలిచే విధానాన్ని జేసీ పరిశీలించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీ మాయాజాలం

ఆయిల్ ధరలు పెంచేసిన వ్యాపారులు
దిగుమతి సుంకం పేరుతో పాత స్టాకుపైనా దోపిడీ
-7లో


విష్ణు కళాశాలలో స్పేస్ వాక్ ప్రారంభిస్తున్న ఎస్పీ నయీం అస్మీ

విష్ణు విద్యాసంస్థల ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 5 :విద్యార్థులు విద్యపట్ల శ్రద్ధ చూపుతూ ఉన్నత విలువలతో కూడిన జీవనం అలవాటు చేసుకోవాలని, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సూచించారు. డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ విష్ణు స్కూల్ ఆధ్వర్యంలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ వారు నిర్వహించే ఇస్రో అంతరిక్ష వారోత్సవాలను శనివారం స్పేస్ వాక్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంలో విష్ణు విద్యాసంస్థలు ప్రోత్సహిస్తూ ముందు వరసలో ఉంటాయన్నారు. విష్ణు స్కూల్ ప్రిన్సిపాల్ బిందు, ఎల్‌పి ఏడుకొండలు, ఇస్రో శాస్త్రవేత్తలు, క్యాంపస్ డైరెక్టర్ జె.ప్రసాదరాజు, స్టూడెంట్ ఎఫైర్ డైరెక్టర్ పి. శ్రీనివాసరాజు, డీజీఎం ఎం.రమేష్‌రాజు, ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీయే రాష్ట్ర కార్యదర్శిగా లూర్థుమాత



ఏలూరు అర్బన్, అక్టోబరు 5 : తెలుగుదేశం పార్టీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీయే) రాష్ట్ర కార్యదర్శిగా చింతలపూడి జడ్పీ హైస్కూలు హిందీ టీచరు ప్రత్తిపాటి లూర్థుమాత ఎన్నికయ్యారు. గుంటూరులోని ఏపీఎన్జీవో హోంలో శనివారం నిర్వహించిన సంఘ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశం సందర్భంగా ఈ ఎన్నిక జరిగింది. వివరాలను సంఘ జిల్లా నాయకులు ఇక్కడి పత్రికలకు తెలియజేశారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యా యులపై పని ఒత్తిడిని, యాప్‌ల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి పదవికి ఎన్నికైన లూర్థుమాతను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంక ట్రావు, ప్రధాన కార్యదర్శి హైమారావు, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వెంకట రమణారావు, టి.మురళి, ఆర్థిక కార్యదర్శి బి.రాము, రాష్ట్ర కార్యదర్శి టి.విజయానంద్ తదితరులు అభినందించారు.

8న విజయవాడలో కౌలురైతుల రాష్ట్ర సదస్సు


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 5 : కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 8వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జడ్పీ అతిథిగృహం ఆవరణలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనం తరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, పెట్టుబడిదారులు, కౌలు రైతులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కౌలు రైతుల రాష్ట్ర సదస్సు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని చెప్పారు.


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలి

పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

గణపవరం, అక్టోబరు 5: ఖరీఫ్ ధాన్యం ప్రక్రియ నిర్వహించడానికి అధికారులు సంసిద్ధం కావాలని పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు కోరారు. ధాన్యం సేకరణ అనుబంధ శాఖల అధికారుల, సిబ్బందితో శిక్షణా కార్యక్రమం శనివారం గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ ధాన్యం దిగుబడిపై అంచనాలను వివరించారు. ప్రస్తుతం రైతులకు మద్దతు ధర కామన్ రకానికి క్వింటా రూ.2300, గ్రేడ్ ఏ రకానికి రూ.2320 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. దళారుల భారిన పడకుండా ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని వారికి నచ్చినటువంటి రైస్‌మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు 24 నుంచి 28 గంటల వ్యవధిలో ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతు నష్టపోకుండా సహకరించాలని అధికారులకు వెంకటేశ్వరరావు సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో తహసీల్దార్ అప్పారావు, ఎంఏవో వైఏఎస్ ప్రసాద్, ఎంఎల్‌వో దాస్, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైస్‌మిల్లర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



డ్రిప్ వినియోగంతో మెరుగైన ఫలితాలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 5: డ్రిప్ విని యోగం ద్వారా సాగులో మెరుగైన ఫలి తాలు సాధించవచ్చని విస్త రణ సంచాలకులు డాక్టర్ గోవింద రాజులు పేర్కొన్నారు. వెంకట్రామన్ననగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఆవరణలోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్వయం చాలక పరికరాల వినియోగంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రిప్ ద్వారా ఎరువుల సామర్థ్యం పెరుగుతుందని వాటికి మార్కెట్‌లో నూతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు వివరించారు. విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు మాధవి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కరుణశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆనంద్‌కుమార్, మొబిటెల్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రారండోయ్ !

వాహనాలపై దసరా ఆఫర్ల జోరు

ఏలూరు సిటీ, అక్టోబరు 5:దసరా అంటే ప్రతి ఇంటా సందడే. ముఖ్యంగా ఈ దసరా సమయంలోనే వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి.కొత్త వాహనాలు కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. వ్యాపార సంస్థలు క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తుండగా ఆన్‌లైన్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ద్వారా కొనుగోలు చేసే ప్రతి టూవీలర్‌కు ఆఫర్లు అందిస్తున్నారు. విజయదశమి రోజున కొత్త వస్తువులను కొనుగోలు చేయడం చాలామందికి అనవాయితీ. ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, ఇతర గృహోపకరణాలు కొనుగోలు చేస్తుంటారు. మోటార్ సైకిల్, కార్ల షోరూమ్‌ల వారు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు.మెగాలోన్ ఎక్స్ఛేంజ్ మేళాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు మెయిన్ రోడ్, కన్రెవంతెన, సత్రంపాడు ప్రాంతాల్లో సాయి స్వర్ణ మోటార్స్ ప్రత్యేక ఆఫర్లు శిబిరాలు ఏర్పాటు చేశారు

మెగా లోన్ ఎక్స్ఛేంజ్ మేళాలు

దసరా వచ్చిందంటే ఆఫర్ల సందడి కనిపిస్తూంటుంది. మోటార్ సైకిల్ కంపెనీలు డిస్కౌంట్ , జీరో వడ్డీ ఆఫర్లను ఇస్తున్నారు. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని వివిధ పట్టణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు అమ్మే వ్యాపారులు కూడా పలు రకాల డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించారు. అన్ని మోటార్ సైకిల్స్‌పై అతి తక్కువ డౌన్ పేమెంట్ రూ.3,999తో, అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ ఏలూరు సాయిస్వర్ణ మోటార్స్ ఆఫర్లను ప్రకటించింది. ఏలూరులోని పేరయ్యకోనేరు గ్రౌండ్స్, బడేటి పార్క్, ఏలూరు మెయిన్‌రోడ్‌తో పాటు పలు ప్రదేశాల్లో మెగా లోన్ ఎక్స్ఛేంజ్ మేళాలను నిర్వహిస్తున్నారు.



రోడ్డు పక్కన ఎక్స్ఛేంజ్ మేళాలు

ఆకివీడు : జాతీయ రహదారి పక్కన యమహా టూ వీలర్ల ఎక్స్ఛేంజ్ శిబిరాలు ఏర్పాట్లు చేసి ఆఫర్లతో ప్రకటించి అమ్మకాలు సాగిస్తున్నారు. అమ్మకాలు మందకొడిగానే జరుగుతున్నట్టు వ్యాపారులు తెలుపుతున్నారు. తక్కువ వడ్డీరేటు, స్మార్ట్ వాచీ ఉచితం, ఫుల్‌ట్యాంక్ పెట్రోలు, తక్కువ ఈఎమ్‌ఐ, మార్కెట్ ధరపై ఎక్స్ఛేంజ్, క్యాష్‌బ్యాక్, డౌన్‌పేమెంట్ వంటి ఆఫర్లు కల్పిస్తున్నారు. ప్రతీ సుజికీ స్కూటర్ కొనుగోలుపై స్క్రాచ్‌కార్డ్ ఆఫరులో ఒక గ్రాము బంగారు నాణెం, క్యాష్ బ్యాగులు, పదేళ్ల వారెంటీ వంటి ఆఫర్లతో అమ్మకాలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ సంస్థల ఆఫర్లు



ఆన్‌లైన్ సంస్థల ద్వారా కొనుగోలు చేసే ప్రతి వాహనానికి రూ.15 వేల వరకు ఆఫర్ ప్రక టించారు. హీరో కంపెనీకి చెందిన ప్లెజర్, డెస్టినీ, జూమ్ స్కూటర్లు) కొనుగోలు చేసేవారికి రూ. 7,777 గుడ్ లైఫ్ ద్వారా ఓచర్లు లభిస్తాయి.గతంలో వినియోగదారునికి స్కూటర్ కొనుగోలులో ఒక సంవత్సరం పూర్తి ఇన్సూరెన్స్, నాలుగు సంవ త్సరాలు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ వచ్చేవి. ఇప్పుడు 5 సంవత్సరాల పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం ఇస్తున్నాం. గతంలో నాలుగు ఉచిత సర్వీసులు ఇస్తుండగా ఇప్పుడు అదనంగా మరో రెండు ఇస్తున్నాం.

- సోమేశ్వరరావు, సాయిస్వర్ణ మోటార్స్ జీఎం, ఏలూరు

ఎమ్మార్పీ మాయాజాలం

ఆయిల్ ధరలు పెంచేసిన వ్యాపారులు

దిగుమతి సుంకం పేరుతో పాత స్టాకుపైనా దోపిడీ

ఏలూరు రూరల్, అక్టోబరు 5 : వంట నూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి సుంకం గతంలో దిగుమతి చేసుకున్న నూనెలకు వర్తించదు. పాత స్టాక్‌పై ధరలు పెంచి విక్రయించడం నేరం. స్టాకు ఉండి కూడా లేన్నట్టుగా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారుల వంట నూనెల వ్యాపారులను హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలను జిల్లాలోని వంట నూనెల వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. అటు వ్యాపారులు, ఇటు మాల్స్, సూపర్ మార్కెట్ల నిర్వాహకులు వంటనూనె ధరల విషయంలో ఒక్క మెట్టు కూడా దిగలేదు. నూనె ధరలు అమాంతం పెంచేశారు. ఒక్కో ఆయిల్ ప్యాకెట్‌పై రూ.20 పెంచిన ధరనే వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కువగా ఇస్తున్నామని సమాధానాలు చెబుతున్నారు. బ్రాండెడ్ నూనెను దాచేసి రెండు, మూడు రకాల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. ముడిచమురుపై కస్టమ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిందే తడవుగా గతనెల నుంచి వంట నూనెలు విక్రయించే వ్యాపా రులు అమాంతం పెంచేశారు. కొత్తగా దిగుమతి చేసుకున్న ఆయిల్ పైనే పెంచిన సుంకం అమలు చేయాలని చెబుతున్నా పాత స్టాకుపై వ్యాపారులు అమలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. బ్రాండ్‌ను బట్టి రూ.100 నుంచి రూ.110 మధ్య ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు ప్యాకెట్‌ను రూ.138 లకు పెంచేశారు. రైస్ బ్రౌన్ ఆయిల్‌ను రూ.130 చేశారు. పామాయిల్, సోయాబీన్ ఆయిల్స్‌ను లీటరుకు రూ.20 చొప్పున పెంచారు. పాత ధరలకే విక్రయించాలని అధికారులు స్పష్టం చేస్తున్నా ఏ ఒక్క వ్యాపారి పట్టించుకోవడం లేదు. వంట నూనె ప్యాకెట్‌పై ఎమ్మార్పీ ఉంటుంది. గతంలో రూ.100కు విక్రయించిన ప్యాకెట్‌పై ఎమ్మార్పీ రూ.160 వరకు ఉంటుంది. ఇప్పుడు దానిని చూపుతూ ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఎమ్మార్పీ మాయాజాలాన్ని సంబంధిత అధికారులు అరికట్టలేకపోతున్నారని సామాన్యులు పెదవి విరుస్తున్నారు.


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి రామానాయుడు

మార్గదర్శకులు.. ఉపాధ్యాయులు

కూటమి ప్రభుత్వంలో వారికి సమున్నత గౌరవం

గురుపూజోత్సవ సభలో మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, అక్టోబరు, 5 దేశ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అనీ, సమాజంలో మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గత ప్రభుత్వం వారిని అగౌరపరిస్తే తమ ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి గౌరవిస్తుందని అన్నారు. పాలకొల్లులో శనివారం రాత్రి ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ గురుపూజోత్సవ వేడుకల్లో మంత్రి నిమ్మల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 125 మంది ఉపాధ్యాయ దంపతులను సత్కరించి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్మల మాట్లాడుతూ తాను కూడా పదేళ్ల పాటు అధ్యాపకుడిగా పనిచేశానని ఇప్పటికీ శిష్యుల వద్ద ఎంతో గౌరవం పొందుతూ సంతృప్తి చెందుతున్నానన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, సినీ ఆర్టిస్ట్ ప్రదీప్ కుమార్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవీ, బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నరసాపురం, అక్టోబరు 5: నరసాపురం పట్టణంలోని నిడదవోలు పంటకాల్వ అవతల వైపున నివాసం ఉంటున్న ప్రాంతంలోకి వెళ్లి ఎనిమిదేళ్ళ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయలక్ష్మి చెప్పారు. యలమంచిలి మండలం మేడపాడుకు చెందిన ప్రసాద్ మద్యం మత్తులో తిరుగుతూ తెల్లవారుజామున తలుపు తీసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించాడన్నారు. ఆ సమయంలో బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో కేకలు వేసిందన్నారు. పారిపోతున్న ప్రసాద్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారన్నారు. అతడిని విచారించి పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

తాతను కొట్టిన మనవడు అరెస్టు

పాలకోడేరు, అక్టోబరు 5: కుటుంబ కలహాల నేపథ్యంలో తాతను కొట్టిన మనవడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పాలకోడేరు ఎస్‌ఐ హరిబాబు శనివారం తెలిపారు. మైపా గ్రామానికి చెందిన పనసా పాపారావు తరచూ ఆమె భార్యను కొడుతూ ఉంటాడు. దీంతో ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన గరగా శేషారావు తన మనమరాలి కాపురాన్ని సరి చేసేందుకు జూన్ 16న మైపా గ్రామం వచ్చాడు. సర్దిచెప్పే ప్రయత్నం చేయగా పాపారావు శేషరావును బండబూతులు తిట్టి సిమెంటు ఇటుకతో కొట్టాడు. శేషారావును భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. శేషారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసుపత్రి నుంచి వచ్చిన నివేధిక ఆధారంగా శనివారం పాపారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తణుకు మిల్క్ డైరీలో చోరీ

తణుకు, అక్టోబరు 5 :తణుకు పట్టణంలోని ఆలమూరి వారి వీధిలో ఉన్న మిల్క్ డైరీలో శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. మిల్క్ డైరీ తాళాలు పగలు కొట్టి షాపులో ఉన్న నగదు దొంగిలించారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో నమోదయ్యాయి, షాపు యజమాని కోరపాటి రాజబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు

లింగపాలెం, అక్టోబరు 5: తన భార్య కనిపించడం లేదంటూ భర్త ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ వెంకన్న తెలిపారుజ లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామానికి చెందిన కొత్తూరు జమీల అనే మహిళ గత నెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త, కుటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెదవేగి, అక్టోబరు 5 : పెదవేగి మండలం కొప్పులవారిగూడెం పంచాయతీ నాగన్నగూడేనికి చెందిన చలపాటి రత్నకుమారి(50) ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. రత్నకుమారి సెప్టెంబరు నెల 29వ తేదీన రోడ్డుపై వెళ్తుండగా లక్ష్మీపురం పంచాయతీ వీరంపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రత్నకుమారిని తొలుత ఏలూరు సర్వజన ఆస్పత్రికి, అక్కడనుంచి మెరుగైన చికిత్సకు విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యం..అప్పులు తట్టుకోలేక ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : అనారోగ్యం ఒకవైపు మరో వైపు ఆర్థిక పరిస్థితులు తట్టుకోలే ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు అమీనాపేట ఏటిగట్టు ప్రాంతానికి చెందిన జోగి మోహన కోటేశ్వరరావు (44)కు భార్య ఉంది. వీరికి సంతానం లేరు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంకోవైపు ఆర్థిక పరిస్థితులు బాగోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 4వ తేదీ రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఏలూరు త్రిటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలం పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లోంచి వెళ్లిపోయిన మహిళ

కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : భార్యా భర్తల మధ్య కలహాల నేపథ్యంలో పుట్టింటికి వచ్చిన ఆమెను తండ్రి మంద లించడంతో తీవ్ర మనస్థాపానికి గురై మూడు నెలల పసిబిడ్డతో సహా ఆత్మ హత్య చేసుకుందామని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఆమెను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన కొప్పుల అఖిల (22) ఆమె భర్త మహేష్‌తో గొడవ పడి ఈనెల 4వ తేదీన మూడు నెలల పసిబిడ్డతో పుట్టింటికి వచ్చే సింది. తండ్రి మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి పసిబిడ్డతో సహా ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఈ సమాచారం ఏలూరు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్‌కు అందడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి శనివారం వేకువజామున విజయవాడలో ఉన్నట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్ళి ఆమెను తీసుకుని కుటుంబ సభ్యులకు శనివారం ఉదయాన్నే అప్పగించారు.

హత్యాయత్నం కేసులో 9 మంది అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 5 :జాతరలో జరిగిన గొడవ నేపథ్యంలో కక్షా పెంచుకుని దారి కాచి కత్తులతో దాడి చేసిన 9 మందిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం ఎమ్మార్సీ కాలనీలో గంగానమ్మ జాతర ఊరేగింపు గత నెల 29వ తేదీ రాత్రి జరిగింది. ఊరేగింపులో డీజె సౌండ్‌ల పాటల విషయంపై అదే ప్రాంతానికి చెందిన మానుకొండ వెంకటేశ్వరరావు అలియాస్ నాగేంద్రరావుకు అదే ప్రాంతానికి చెందిన వల్లూరి సాయికుమార్‌లకు గొడవ జరిగింది. అర్ధరాత్రి ఊరేగింపు ముగిసిన తరువాత నడిచి వస్తున్న మానుకొండ వెంకటేశ్వరరావుపై ఏలూరులోని తంగెళ్ళమూడి ప్రాంతం ఎంఆర్‌సీ కాలనీకి చెందిన సాయికుమార్, ఏలూరులోని కబడ్డీ కాలనీకి చెందిన పెనుమునూరి రామయ్యా అలియాస్ రాము, జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన నంది పాము సురేష్, ఏలూరు కబడ్డీ కాలనీకి చెందిన మందం సునీల్, ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీకి చెందిన కోమాకుల సాయికుమార్ అలియాస్ మల్లెపూలు, ఏలూరు కబడ్డీ కాలనీకి చెందిన పరసా పవన్‌కుమార్, ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన మైనర్‌బాలుడు (17) కబడ్డీ కాలనీకి చెందిన ఇద్దరు మైనర్లు కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలవగా ఆతనిని విజయవాడకు తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ రమణ,ఎస్‌ఐ నాగ కల్యాణి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలించి శనివారం ఉదయం తంగెళ్ళమూడి ప్రాంతంలో వీరందరిని అరెస్టు చేశారు.

కారు పార్కింగ్ చేస్తుండగా ప్రమాదం..మహిళ మృతి


ఉంగుటూరు, అక్టోబరు 5 : ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో కారు పార్కింగు చేస్తుండగా ఒక మహిళను ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. నడిమింటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తన కారు పార్కింగు చేస్తుండగా కింది పోర్షన్‌లో అద్దెకుంటున్న పసుపులేటి ఉదయ్ కుమారి ఇంటికి వచ్చిన అక్క ధనలక్ష్మి (43)తో మాట్లాడుతోంది. కారు పైకి ఎక్కిస్తున్న సమయంలో వేగంగా వచ్చి ధనలక్ష్మిని ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అంద లేదని చేబ్రోలు పోలీసులు తెలిపారు.



చిన వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, అక్టోబరు 5: గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. శనివారం స్వామి దర్శనార్థం విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో నిండి పోయాయి. సుమారు 18 వేల మంది పైబడి భక్తులు స్వామివారిని దర్శించినట్టు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది.

ఎండకు ఇబ్బందిపడిన భక్తులు


మెట్లపై నీటిని వదిలిన సిబ్బంది

శనివారం ఎండవేడిమిని తట్టుకోలేక రాతి మెట్లపై నడిచేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు.దీన్ని గమనించిన అధికారులు వెంటనే స్పందించి మెట్లపై నుంచి నీటిని వదిలారు. దీంతో మెట్లు చల్లబడ్డాయి. మెట్లపై నుంచి భక్తులు రాకపోకలు సాగించారు. భక్తులు గ్రామంలో శీతల పానీయాలు, కొబ్బరి బొండా లను తాగి సేదతీరారు.

రూ.3 కే ధమ్ బిర్యానీ


బిర్యానీ కోసం క్యూకట్టిన జనం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 5 : జంగారెడ్డిగూడెం పట్టణంలోని అశ్వారావు పేట రోడ్డులో శనివారం కొత్తగా అన్ లిమిటెడ్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా రూ.3లకే చికెన్ ధమ్ బిర్యానీ అంటూ ఆఫర్ ప్రకటించారు. దీంతో జనం బిర్యానీ కోసం ఎగబడ్డారు. ఇలా నాలుగు నుంచి ఐదు వేల బిర్యానీ ప్యాకెట్లు అమ్మారు. దీనికోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా తోపు లాట జరగకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. పోలవరం ఎమ్మెల్యే బాలరాజు రెస్టారెంట్‌ను ప్రారంభించగా కూటమి నాయకులు కరటం రాంబాబు, మండవ లక్ష్మణరావు, పారేపల్లి రామారావు, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, పెనుమర్తి రామకుమార్, వైసీపీ నాయకుడు మండవల్లి విజయసారథి తదితరులు పాల్గొన్నారు.


బోట్లను పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పాపికొండల పర్యటనకు అనుమతులు షురూ

పోలవరం అక్టోబరు 5:పాపికొండల పర్యటనకు ఎట్టకేలకు అనుమతులు శనివారం నాటికి షురూ అయ్యాయి. వరదలు, వర్షాల కారణంగా ఆరు నెలలుగా పాపికొండల పర్యటకాన్ని అధికారులు నిలిపివేసిన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఉదయం గొందూరు పోచమ్మగండి ఆలయం వద్ద టూరిజం బోట్లను తనిఖీలు చేశారు. బోట్లలో అత్యవసర పరిస్థితుల్లో ఉండవలసిన లైఫ్ జాకెట్లు, ఫైర్ సేఫ్టీ, ఇరత మౌళిక వసతులు, లైసెన్సులు, ఫిట్‌నెస్ వంటివి ఆమె పరిశీలించారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం, ఆపద కలుగకుండా జాగ్రత్తలు వహించాలని టూరిజం బోట్ల నిర్వాహకులకు సూచించారు. ఏపీ టూరిజం మేనేజర్ గంగబాబు పాల్గొన్నారు.




కళాశాల వద్ద ఆందోళన

విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థి సంఘ నాయకులు..

సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మనస్థాపం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : సర్టిఫికెట్లను ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం పలుమార్లు తిప్పించుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఒక విద్యార్థి కళాశాల ప్రాంగణం వద్ద పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన సిబ్బంది ఆ విద్యార్థిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన చేబోయిన అచ్యుత్ ఏలూరు ఎన్ఆర్‌పేటలో ఉన్న ఎస్వీఆర్‌కె డిగ్రీ కళాశాలకు అనుసంబంధంగా నిర్వహిస్తున్న శ్రీవైష్ణవి జూనియర్ కళా శాలలో గత ఏడాది ఓపెన్ ఇంటర్ బైపీసీ చదివి పాస్ అయ్యాడు. సర్టిఫికెట్లు అడిగితే కళాశాల ప్రిన్సిపాల్ మురళీ ఇవ్వకుండా తిప్పుతున్నాడ న్నారు. మొత్తం ఫీజులు కట్టేశామని, అయినా అదనంగా ఫీజులు చెల్లించాలని వేధిస్తున్నారని ఆ విద్యార్థి ఆరోపించారు. ఫోరెన్సిక్ డిప్లమో కోర్సుకు దరఖాస్తుకు రేపే ఆఖరి గడువని అడిగినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో శనివారం కళాశాలకు వెళ్ళిన అచ్యుత్ సర్టిఫికెట్లు ఇవ్వనని చెప్పడంతో అక్కడే పురుగుమందు తాగి పడిపోయాడు. సిబ్బంది అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే విజయవాడకు తీసుకువెళ్ళారు. సమాచారం అందుకున్న పీడీఎస్‌యూ తదితర విద్యా సంఘ నాయకులు ఆసుపత్రికి వచ్చి విద్యార్థి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల వద్దకు వెళ్ళి ఆందోళన చేపట్టారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో త్రిటౌన్ పోలీసులు చేరుకుని విద్యార్థులను సముదాయించి అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకినాని, వైసీపీ స్టూడెంట్ యూనియన్ నాయకుడు శివరావు తదితరులు మాట్లాడుతూ ఈ కళాశాల మొదటి నుంచి వివాదాలకు కేంద్రంగా ఉందని, విద్యార్థులను వేధిస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యు నగర అధ్యక్షుడు క్రాంతి,ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాయల సతీష్ పాల్గొన్నారు.



అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

నిడమర్రు అక్టోబర్ 5 : వివిధ జిల్లాల్లో బైక్ దొంగతనాలు, దేవాలయాల్లో హుండీల చోరీ, ఇంటి దొంగతనాలు చేస్తున్న అంతరాష్ట్ర దొంగముఠాను నిడమర్రు పోలీసులు చాకచక్యంగా పట్టుకొన్నారు. నిడమర్రు ఎస్.ఐ వీర ప్రసాద్ తెలిపిన వివరాల నిడమర్రు మండలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిడమర్రు మండలం క్రొవ్విడి ఉప్పరగూడెం ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న జువ్వల తరుణ్ కుమార్ , మామిడి దుర్గారావు బేత దుర్గాప్రసాద్, ఎంట్రపాటి రవిలను శనివారం అరెస్టు చేసి విచారించగా వారి నేరప్రవృత్తి బయటపడింది. ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి, వైజాగ్, అనకాపల్లి, గుంటూరు జిల్లాల పరిధిలో మోటారు సైకిల్, హుండీ, ఇంటి దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 2 ద్విచక్ర వాహనాలు, 2 బంగారు సూత్రాలు, 1000 రూపాయల నగదు స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపారు. పోలీసు సిబ్బందిని నిడమర్రు సీఐ సుభాష్ అభినందించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్


సమావేశంలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

లింగపాలెం, అక్టోబరు 5: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా సమస్యల వేదిక అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలతో ఎమ్మెల్యే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన అజెండా అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు అర్జీల రూపంలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లోగా ఆ సమస్యల పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పనిచేయని అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం మండలంలో గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు తెలుసుకుంటామన్నారు. ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ నజీముల్లాషా, జి.చలపతిరావు, ఎం.రాము, జి.బుజ్జియ్య, ఎం.మల్లిఖార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి సాయం

కామవరపుకోట, అక్టోబరు 5 : తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు సిఫార్సుతో లివర్ వ్యాధితో బాధపడుతున్న ఎం.సూర్యనారాయణ కుటుంబానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ రూ.12 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) పత్రాన్ని శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. హైదరాబాదు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తుడు సూర్యనారాయణ కుటుంబానికి అందచేయడం జరిగిందని పార్థసారథి బాబు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకై స్థల పరిశీలన


డిగ్రీ కాలేజీ ఏర్పాటుపై ఎమ్మెల్యే బాలరాజుతో మాట్లాడుతున్న అధికారులు

కొయ్యలగూడెం, అక్టోబరు 5: గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం అధికారుల బృందం కొయ్యలగూడెంలో పర్యటించారు. జూనియర్ కాలేజీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలంటే ఐదెకరాల భూమి కావాలని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వ స్థలం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అధికారులకు హామీ ఇచ్చారు. భూమి పరిశీలించి కాలేజీ ఏర్పాటుకు ఇవ్వాలని తహసీల్దార్ చెల్లన్నదొరను ఆదేశించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రసాద్‌బాబు, గిరిబాబు బృందంలో ఉన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతో నే సాధ్యం


సమావేశంలో మాట్లాడుతూన్న సంజీవరెడ్డి

పెదవేగి, అక్టోబరు 5 : కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యమని రాహుల్ గాంధీ ప్రధాని కాకుండా అపడం ఎవరితరం కాదని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా కాంగ్రెసు పార్టీ వ్యవహారాల కోఆర్డినేటర్ వింత సంజీవ రెడ్డి అన్నారు. దెందులూరు మండలం మందూరులో అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆలపాటి నరసింహమూర్తి నివాసంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావుతో కలిసి శనివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో మండల, గ్రామ, బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కమిటీలను వేయాలని సూచించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వైసీపీ గతే కూటమికి పడుతుందన్నారు. పార్టీ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు ఆలపాటి చౌదరి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్లకు సెలవుల్లోనూ పనులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 5 : ప్రభుత్వ సెలవుల్లోనూ ఉపాధ్యాయులకు పలు విధులు, కార్యక్రమాలను అప్పగిస్తున్నందున విద్యా శాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి ఏడాదికి 30 రోజుల సంపాదిత సెలవుల(ఈఎల్స్)ను మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. ప్రస్తుతం దసరా సెలవులైనప్పటికీ విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని, యాప్‌లలో అవసరమైన సమాచారాన్ని నింపాలని వత్తిడి తెస్తున్నారని, ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సెలవులు విద్యార్థులకు మాత్రమే ఉపాధ్యాయులకు కాదంటున్నారని అన్నారు. వాస్తవానికి టీచర్లు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారైనందున ఏడాదికి ఆరు రోజులు మాత్రమే సంపాదిత సెలవులను జమ చేస్తున్నారని తెలిపారు. దీనికి భిన్నంగా సెలవు దినాల్లోనూ ఉపాధ్యాయులకు వివిధ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

తెలుగుభాషాభివృద్ధికి పట్టుగొమ్మలు కళా సంస్థలు


కేవీఎస్ ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్న మండలి బుద్ధప్రసాద్

ఏలూరు రూరల్, అక్టోబరు 5: తెలుగుభాషాభివృద్ధికి పట్టుగొమ్మలు కళాసంస్థలని మాజీ ఉపసభాపతి, అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సాహితీ మండలి, కేవీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణాపురంలోని సాహితీ మండలి ప్రాంగణంలో శరన్నవ రాత్రుల సాహితోత్సవంలో భాగంగా కళారత్న కేతు సత్యనారాయణ, సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది శిష్యులు కలిగిన గురువుగా నాట్యాచార్య కేవీ సత్యనారాయణ కీర్తి గడించారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని డాక్టర్ దూళిపాల మహాదేవమణి, తాత సందీప్ శర్మలకు కేవీఎస్ సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. సాహితీ మండలి కార్యదర్శి పి.పురుషోత్తం, ఎం.మోహన్‌గుప్తా, మానవత నాగేశ్వరరావు, గుప్తా ఫౌండేషన్ మేనేజరు కె.శ్రీనివాస్, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ సందీప్‌శర్మ, అష్టావధానం అలరించింది.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బుట్టాయగూడెం, అక్టోబరు 5 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన సోమవారం జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

లయన్స్ క్లబ్ సేవా పురస్కారానికి టీచరు ఎంపిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 5 : ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సేవా పురస్కారానికి ప్రభుత్వ ఎంటీఎస్ టీచర్స్-1998 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ ఎంపికయ్యారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన లయన్స్ సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు, బడుగు, బలహీనవర్గాల పురోగతికి చేయూత, పొరుగు జిల్లాల్లో విద్య, వైద్య కార్యక్రమాల నిర్వహను చేపట్టినందుకుగాను ఈ అవార్డుకు ఎంపికచేయడం అభినందనీయమని ఎంటీఎస్ జిల్లా నాయకులు పాషా, శర్మ, కరుణానిధి, ఏసు పాదం, షేక్‌బాజీ తదితరులు అన్నారు.

లడ్డూ కల్తీ దోషులకు శిక్ష పడాలి

ద్వారకాతిరుమల, అక్టోబరు 5: ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్‌కు మద్దతుగా క్షేత్రంలో గోవింద దీక్ష చేపట్టిన జనసేన నాయకుడు నారా శేషు శనివారం ఇక్కడకు వచ్చి మాల విరమించారు. వారం క్రితం ఇక్కడ దీక్ష చేపట్టిన ఆయన ఏలూరులో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారంతో దీక్షా గడువు ముగియడంతో శిరస్సుపై ఇరుముడి ధరించి గోవింద నామస్మరణలతో ఆలయానికి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దోషులకు శిక్షపడేలా చూడాలని ఆ చిన వెంకన్నను కోరుకున్నట్లు చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఏలూరు రూరల్, అక్టోబరు 5: స్థానిక కొత్తపేట, పాత వాటర్ ట్యాంకు ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీపరమతంబ (గుణాలమ్మ) ఆలయ పునఃప్రారంభం సందర్భంగా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వీరభద్రరావు రూ.30 వేలు విరాళం అందజేశారు. అమ్మవారి అలంకరణ, నగలు నిమిత్తం ఉపాధ్యాయుడు బాబు రావు రూ.10,116లు శనివారం కమిటీ సభ్యులకు అందచేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

పరిశోధనా ఫలాలు రైతులకు చేరువ కావాలి

ఎంపీ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ప్రభాకర్


ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయిల్‌పామ్ పంట వివరాలు చెబుతున్న డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్

పెదవేగి, అక్టోబరు 5 : పరిశోధనా ఫలాలు రైతులకు అందితే ప్రభుత్వ లక్ష్యం నెర వేరుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. పెదవేగిలోని భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంచలనాలయం (ఎన్‌ఆర్‌సీ)ను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ శనివారం సందర్శించారు. ఎన్‌ఆర్‌సీ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్ ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు, రైతులకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, రాయితీలు, పథకాల వివరాలను ఎంపీ, ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు చేసే ప్రయోగాల ఫలితాలు రైతులకు మరింత చేరువ కావాలని, అప్పుడే రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. పామాయిల్ తరహాలోనే కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. జోనల్ ఏర్పాటు చేసి, చాక్లెట్ తయారీ కంపెనీల స్థాపనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతోపాటు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన రైతులు ఎంపీని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌సీ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ ప్రసాద్, డాక్టర్ కె.మనోరమ, డాక్టర్ జి.రవిచంద్రన్, డాక్టర్ కేఎల్ మేరీరాణి, డాక్టర్ కె.రామచంద్రుడు, లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు, పార్టీనాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, పంది సూర్య చంద్రరావు, కొనకళ్ళ శివమణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సమస్యలు తెలిపిన గన్ని

భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ దృష్టికి ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు తీసుకువెళ్ళారు. గన్ని గృహానికి అల్పాహార విందుకు హాజరైన ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్‌కు జాతీయ రహదారి పరిధిలోని 39 కిలోమీటర్లలో ఉన్న ఏడు గ్రామాల్లో క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉందని ఇవి లేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రతి గ్రామం సమీపంలో సర్వీసు రోడ్డుతో కలిపి ప్లైఓవర్లు నిర్మించాలని గన్ని వీరాంజనేయులు ఆయనను కోరారు. భీమడోలు రైల్వే ప్లైఓవర్‌ని గ్రామం మీద నుంచి కాకుండా అయ్యప్ప స్వామి గుడి నుంచి మార్చాలని గ్రామస్తులను కోరుతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే కైకరం గ్రామ ప్లైఓవర్ సమస్యపై అక్కడ టీడీపీ నేతలు చింతల వాసు ఎంపీ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత శాఖాధికారులతో చర్చించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన అన్నారు.

కృత్రిమ అవయవాలతో వెలుగులు : ఎమ్మెల్యే చంటి


కృత్రిమ అవయవాలతో ఎమ్మెల్యే చంటి, క్లబ్ సభ్యులు

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 5: కృత్రిమ అవయవాలతో అభాగ్యుల కళ్లల్లో వెలుగులు నింపుతున్న హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అశోక్ నగర్‌లో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. ఒక్కొక్క కృత్రిమ అవయవం తయారు చేయడానికి రూ.4 వేలు ఖర్చవుతుందని నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆర్థిక ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే నేను కూడా కొంత ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా గవర్నర్ వేణుబాబు, వీ.మురళీమోహనరావు, పాపారావు నాయుడు, వైద్యులు డి.సుబ్బారావు, ఆర్.గోపాలకృష్ణయ్య, పీబీ రమణ, ఏబీ రావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అపన్నహస్తం అందించాలి

ఆపదలో ఉన్నవారికి అపన్నహస్తం అందించేందుకు సమాజంలో ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రామచంద్రరావుపేటలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి మహిళా సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి విష్ణుసహస్రనామ పారాయణం చేయించి హారాన్ని బహూకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంజనీరింగ్‌లో సీటు సాధించిన పేద విద్యార్థికి ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం తరపున సంఘ అధ్యక్షులు డి.జయప్రకాశ్ రూ.69,300లు అందజేశారు. దేవస్థానం మాజీ ధర్మకర్త ఇ.శ్రీనివాసరావు, అర్చకులు ఏఎంఎస్ రామానుజచార్యులు, వేదపండితులు వై.రవిప్రకాశ్, ఎ.తిరుపతి, ఎ.అశోక్, వి.ప్రసాద్, సంఘ గౌరవాధ్యక్షులు రవికుమార్, ఎస్.జగదీష్, మహిళా సంఘ అధ్యక్షురాలు కె.రమాదేవి, పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

చింతలపూడి, అక్టోబరు 5 : మహిళల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్.పురుషోత్తమకుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళల న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి ఉన్న చట్టాలను వివరిస్తూ వీటికి ఉచిత న్యాయం పొందాలంంటే న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వాటిలో గృహ హింస, మనోవర్తి కేసులు ఎక్కువగా ఉన్నాయని, ఇవికాక మానవ అక్రమ రవాణ, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు ఉన్నాయని వీటి నుంచి రక్షణ పొందడానికి చట్టాలు ఉన్నాయని వాటిని అర్థం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఆయన చింతలపూడి సబ్ జైలును సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.మధుబాబు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో మాధవి, మునిసిపల్ కమిషనర్ బి.పావని, సీఐ రవీంద్ర, జైల్ సూపరింటెండెంట్ కృపానందం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఈ పంటలో నమోదైన పంట పొలాల పరిశీలన


జంగారెడ్డిగూడెం మండలంలో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

ఉంగుటూరు, అక్టోబరు 5 : మండలంలో ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయమై శనివారం సంబంధిత రైతులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ భాషా సూపర్ చెక్ చేశారు. ఇదే సమయంలో వెల్లమిల్లి ఆయకట్టులో ధాన్యం కొనుగోలు గురించి రైతులతో చర్చించారు. ఏవో ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం : మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంట నమోదైన ప్రగడపల్లి, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, ఎల్లండిపేట గ్రామాల్లో పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌కే హబీబ్, కేఆర్ పురం సహాయ వ్యవసాయ సంచాలకులు బుజ్జిబాబు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు పాల్గొన్నారు.

● చింతలపూడి : మండలంలో ప్రగడవరం, దేశవరం, శంకుచక్రపురం, పొనుకుమాడు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ పాషా ఈక్రాప్ నమోదును పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల్లో కూడా తనిఖీలు చేశారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగకుమార్, ఏవో కె.మీనాకుమారి, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : తిరుమలాపురం, లక్కవరం గ్రామాల్లోని ఈపంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా, కేఆర్‌పురం వ్యవసాయ సహాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు పరిశీలించారు. అనంతరం గురవాయిగూడెంలో 18వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో పాటు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు పత్రాలను విడుదల చేశారు. ఏవో కేఎస్‌వీ పోశారావు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు అలంకరణలు..


ఏలూరులోని కాశీ అన్నపూర్ణాదేవిగా సౌభాగ్యలక్ష్మీదేవి


జంగారెడ్డిగూడెంలో గాయత్రీ దేవిగా నూకాలమ్మవారు


పెదవేగి మండలం రాట్నాలకుంట లలితాదేవిగా రాట్నాలమ్మవారు


ద్వారకాతిరుమలలో అన్నపూర్ణాదేవిగా కుంకుళ్లమ్మవారు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు/కామవరపుకోట/చింతలపూడి/ పోలవరం/ పెదవేగి/భీమడోలు/ద్వారకాతిరుమల /ఉంగుటూరు/జంగారెడ్డిగూడెం, అకోబరు 5 : నగరంలోని అమ్మవార్లు కాశీ అన్నపూర్ణాదేవిగా, కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సత్రంపాడులోని అంబికా దేవి అమ్మవారికి, శ్రీసౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారికి, కాశీ అన్నపూర్ణాదేవిగా, పవరుపేట స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలోని కాశీ అన్నపూర్ణాదేవిని కాత్యాయనిదేవిగా అలంకరించి దర్శనమిచ్చారు. కామవరపుకోట శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, శ్రీనివాసాచార్యులు భక్తులతో సామూహికంగా అభిషేకాలు, అర్చనలు, కుంకు మార్చనలు జరిపించారు. చింతలపూడి వేగిలింగేశ్వర స్వామి ఆలయంలో దుర్గామాతకు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. పోలవరం మండలంలో కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణ దేవీగా అలంకరించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మవారు లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భీమడోలు మండలం గుండుగొలనులో వేంచేసిన భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీధన లక్ష్మిదేవి అలంకారంలో, ద్వారకాతిరుమలలోని కుంకుళ్లమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెంలో గంగానమ్మవారు అన్నపూర్ణా దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణా దేవి, గురవాయిగూడెంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మ, శ్రీనూకాలమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ వారు చంద్ర ఘంటిగా భక్తులకు దర్శనమిచ్చారు.


చింతలపూడిలో రాజరాజేశ్వరిదేవిగా దుర్గామాత


గుండుగొలనులో ధన లక్ష్మిదేవి అవతారంలో అమ్మవారు


పోలవరంలో అన్నపూర్ణ అవతారంలో వాసవీమాత


ఉంగుటూరులో చంద్ర ఘంటి మాతగా చల్లాలమ్మ

నాగమణికి వైద్యం అందేనా..?


ఆక్సిజన్ సిలిండర్‌తో ఆస్పత్రి వద్ద ఉన్న నాగమణి

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు తమ కళ్ల ఎదుటే ప్రాణం పోతుందని తెలిసినా తమకు పట్టనట్టు వ్యవహరించిన ఘటన శనివారం రాత్రి జరిగింది. కైకలూరు మండలం దేవిచింతపాడు కు చెందిన తానేటి నాగమణి కడుపునొప్పితో బాధపడు తు ఏలూరు ఎన్‌ఆర్ పేటలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్ప త్రికి రెండు నెలల క్రితం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు కణిత ఉందని ఆపరేషన్ చేశారు. అయితే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిన దగ్గర నుంచి ఆమె అనారోగ్యానికి గురైంది. ఆమెను మరో ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేసిన ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్ అయిందని, ఆపరేషన్ ఎక్కడ చేశారో అక్కడికే వెళ్లాలని సూచించారు. దీంతో ఆమెను తీసుకుని ఎన్‌ఆర్ పేటలోని ఆస్పత్రికి వచ్చారు. అక్కడ వైద్యులు ఆమెకు వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రి ఎదుటే ఆక్సిజన్ సిలిండర్‌తో రాత్రి 11.30 వరకు ఉంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. డీసీ హెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితరాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమెకు జరిగిన వైద్యంపై ఆస్పత్రి వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. అర్ధరాత్రి వరకు అధికారుల విచారణ జరుగుతూనే ఉంది.

రేపు పురుషుల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, అక్టోబరు 5: ఏలూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ జీఎస్ఎస్ పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్, ఇంటర్ డిస్ట్రిక్ ఫుట్‌బాల్ పోటీలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఎన్టీఏ రాష్ట్ర కార్యదర్శిగా లూర్ధుమాత



ఏలూరు అర్బన్, అక్టోబరు 5 : టీడీపీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) రాష్ట్ర కార్యదర్శిగా చింతలపూడి జడ్పీ హైస్కూలు హిందీ టీచరు ప్రత్తిపాటి లూర్ధుమాత ఎన్నికయ్యారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో శనివారం నిర్వహించిన సంఘ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వివరాలను సంఘ జిల్లా నాయకులు శనివారం వెల్లడించారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లా డుతూ ఉపాధ్యాయులపై పనిఒత్తిడిని, యాప్‌ల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తా మన్నారు. క్షేత్ర స్థాయిలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి పదవికి ఎన్నికైన లూర్ధుమాతను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకట్రావు, ప్రధానకార్యదర్శి హైమారావు, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు సీహెచ్.వెంకటరమణారావు, టి.మురళి, ఆర్థిక కార్యదర్శి బి.రాము, రాష్ట్ర కార్యదర్శి టి.విజయానంద్ తదితరులు అభినందించారు.

నడక పోటీలో ప్రతిభ చూపిన రామారావు



ఉంగుటూరు, అక్టోబరు 5 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా జరిగిన వివిధ పోటీలలో ఏలూరు జిల్లా నుంచి గొల్లపల్లి రామారావు ప్రతిభ కనబరిచారు. నడక పోటీలో ఆయన రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ వివరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 5 : అధ్వానంగా ఉన్న సుందరయ్యకాలని, శ్రీనివాస నగర్, గ్రీన్ సిటీ, కొత్తూరు ఇందిరమ్మకాలనీలలోని రోడ్లను అభివృద్ధి చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. సుందరయ్యకాలనీలో శనివారం జరిగిన సీపీఎం సభకు హాజరైన జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రోడ్లన్నీ గోతులమయమై రాక పోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. వీటికితోడు అడ్డూ అదుపు లేకుండా నిత్యావసర ధరలు, కూరగాయలు పెరిగిపోతున్నా పట్టించు కోవడం లేదని ధ్వజమెత్తారు. నాయకులు వి.సాయిబాబు, సత్తిరాజు, ఆర్.నరసింహమూర్తి, పిల్లి గురుమూర్తి, ఎ.గంగాధరరావు, కె.చెన్నారావు, కె.నాగమణి, లక్ష్మీకుమారి, గౌరి, 19వ డివిజన్ శాఖ కార్యదర్శి ఎ.గంగాధరరావు పాల్గొన్నారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

ఏలూరు రూరల్, అక్టోబరు 5: జిల్లాలో అక్రమంగా తొలగించిన వీవోఏలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (వీవోఏ) సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐదునెలల వేతన బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కోశాధికారి ఆమని అధ్యక్షతన ధర్నా జరిగింది. గౌరవాధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ అక్రమంగా తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ కక్షగట్టి అన్యాయంగా తొలగించటం మానుకోవాలన్నారు. ధర్నా శిబిరం వద్దకు డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. నాయకులు మేరి, ఆదిలక్ష్మి, పావని, మరియమ్మ, రమాదేవి, వరలక్ష్మి, జగదాంబ, సుజాత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాం


ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో విద్యార్థులు

భీమడోలు, అక్టోబరు 5 : శ్రీవేంకటేశ్వర జూనియర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ బి సర్టిఫికెట్ పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. కళాశాలకు సంబంధించిన 25 మంది ఎన్‌సీసీ క్యాడిట్స్ పరీక్షలకు హాజరు కాగా 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు దీనికి సంబంధించిన సర్టిఫికెట్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మాధవి, ఎన్‌సీసీ అధికారి శివశంకర్ అభినందించారు. డిగ్రీ థర్డ్ ఇయర్, బీకాం విద్యార్థి అశోక్ చక్రి రిపబ్లిక్ డే శిక్షణ శిబిరానికి ఎన్నికయ్యాడని, నవంబర్‌లో కాకినాడలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరవుతారని ఈ సందర్భంగా తెలిపారు.

బెజవాడకు కాలినడకన భవానీలు

పోలవరం, అక్టోబరు 5 : దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసీమ గ్రామానికి చెందిన భవాని మాల దీక్ష భక్తులు శనివారం ఉదయం బెజవాడ దుర్గమ్మ సన్నిధికి పయనమయ్యారు. 48 రోజుల దీక్ష ముగిసిన సందర్భంగా ఏడుగురు భవాని దీక్ష పరులు కాలినడకన బెజవాడ పయనమయ్యామని మంగళవారం బెజవాడ చేరుకుని గిరి ప్రదక్షిణలు చేసి ఇరుముడులు సమర్పించుకుంటామని గురుభవాని బి.బంగారం తెలిపారు.

మ్యాథ్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, అక్టోబరు 5 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ అధ్యాపక పోస్టుకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సంజీవని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 4 ట్రాక్టర్లు స్వాధీనం

పోలవరం, అక్టోబరు 5 : అనుమతి లేకుండా కొవ్వాడ కాలువ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం ఉదయం దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు. ప్రగడపల్లి సమీపంలో కొవ్వాడ కాలువ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి, హుకుంపేట, కొవ్వూరుపాడు గ్రామాలకు చెందిన నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి, అక్టోబరు 5 : చింతలపూడి నగర పంచాయతీ నాగి రెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరు ప్రాజెక్టు వద్ద శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపి భూమిలో పాతి పెట్టబడిన వెయ్యి లీటర్ల సారాకు ఉపయోగించే బెల్లపు ఊటను వెలికి తీసి ధ్వంసం చేశారు. దాడుల్లో ఇనస్పెక్టర్ బోగేశ్వరరావు, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గత బిల్లులివ్వలేదని..

రెండేళ్లుగా వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ ప్రాంత ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదార్ల మరమ్మతులకు నిధులు మంజూరైనా నేటికీ పనులు మాత్రం చేపట్టలేదు. పలు రహదార్ల మరమ్మతు పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి అగ్రిమెంట్లు జరిగినా కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావటం లేదు.

టెండర్లు పూర్తయినా ప్రారంభం కానీ రోడ్ల పనులు

రూ.10 కోట్ల పనులకు అగ్రిమెంట్లు

పనులు చేపట్టని కాంట్రాక్టర్లు

ముదినేపల్లి, అక్టోబరు 5 : గతంలో చేసిన రోడ్ల పనుల బిల్లులు ప్రభుత్వం నుంచి అందాకే అగ్రిమెంట్లు చేసుకున్న పనులు చేపడతామని కాంట్రాక్టర్లు భీష్మించారు. ఆర్‌అండ్‌బీ శాఖ కైకలూరు సబ్ డివిజన్ పరిధిలోని ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లోని పలు ప్రధాన రహదారుల మరమ్మతులకు ఏడాది క్రితమే రూ. 15 కోట్ల వ్యయమయ్యే ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బి అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రూ.10 కోట్ల పనులకు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కూడా ఖరారు చేశారు. మరో రూ.5 కోట్ల పనులకు అగ్రిమెంట్లు చేయాల్సి ఉంది. అయితే అగ్రిమెంట్లు పూర్తయిన పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. కారణం ఇంతకుముందు తాము చేసిన పనులకు బిల్లుల చెల్లింపు పూర్తి కాలేదని, సొమ్ములు లేక కొత్త పనులు చేపట్టలేక పోతున్నామని కాంట్రాక్టర్లు అధికారులకు చెప్పేస్తున్నారు. అగ్రిమెంట్ల కాలపరిమితి ఉండటంతో అధికారులు కూడా చర్యలు తీసుకోవటం లేదు. ఈ లోగా అప్పటి గోతులు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. పాత ఎస్టిమేట్, విలువ కూడా రెట్టింపు కావటంతో నష్టం వస్తుందన్న కారణంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు సుముఖంగా లేక అగ్రిమెంట్లు రద్దు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఉదాహరణకు ముదినేపల్లి - బీమవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో కలిదిండి వరకు రహదారి మరమ్మతులకు రూ. 4 కోట్లు గతంలో మంజూరు కాగా, ఇప్పటి రోడ్డు పరిస్థితిని బట్టి రూ.7 కోట్లు వ్యయమవుతుంది. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నారు.



ముదినేపల్లిలో అధ్వానంగా ఉన్న రహదారులు

చర్యలు తీసుకుంటున్నాం: ఆర్‌అండ్‌బీ డీఈఈ, కైకలూరు

కైకలూరు సబ్ డివిజన్‌లో రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పాత బిల్లలు పెండింగ్ కారణంగా కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టడం లేదు.



హోం మంత్రి చేతుల మీదుగా కప్ తీసుకున్న జట్టు

కబడ్డీలో హీల్ బాలికల హ్యాట్రిక్ విజయం

ఆగిరిపల్లి, అక్టోబరు 5: విశాఖ జిల్లా పాయకరావుపేటలోఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన సీబీఎస్‌ఈ క్లస్టర్ సెవెన్ బాలికల కబడ్డీ పోటీల్లో తోటపల్లి హీల్ పాఠశాల బాలికల జట్టు వరుసగా మూడోసారి ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ బి.సాయిబాబు తెలిపారు. అండర్-17 విభాగంలో హీల్ స్కూల్ హ్యాట్రిక్ సాధించడంతో పాటు 9వ తరగతి విద్యార్థిని జె.కీర్తన బెస్ట్‌ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిందన్నారు. టోర్నమెంట్ విజేత కప్పును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా అందుకుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు మిక్కిలినేని హరీష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఎస్. నాగరాజు, సిహెచ్ దాసు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ మాయాజాలం

ఆయిల్ ధరలు పెంచేసిన వ్యాపారులు

దిగుమతి సుంకం పేరుతో పాత స్టాకుపైనా దోపిడీ

ఏలూరు రూరల్, అక్టోబరు 5 : వంట నూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం పెంచిన దిగుమతి సుంకం గతంలో దిగుమతి చేసుకున్న నూనెలకు వర్తించదు. పాత స్టాక్‌పై ధరలు పెంచి విక్రయించడం నేరం. స్టాకు ఉండి కూడా లేన్నట్టుగా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారుల వంట నూనెల వ్యాపారులను హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలను జిల్లాలోని వంట నూనెల వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. అటు వ్యాపారులు, ఇటు మాల్స్ సూపర్ మార్కెట్ల నిర్వాహకులు వంటనూనె ధరల విషయంలో ఒక్క మెట్టు కూడా దిగలేదు. నూనె ధరలు అమాంతం పెంచేశారు. ఒక్కో ఆయిల్ ప్యాకెట్‌పై రూ.20 పెంచిన ధరనే వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కు వగా ఇస్తున్నామని సమాధానాలు చెబుతున్నారు. బ్రాండెడ్ నూనెను దాచేసి రెండు, మూడు రకాల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులో ఉంచు తున్నారు. ముడిచమురుపై కస్టమ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిందే తడవుగా గతనెల నుంచి వంట నూనెలు విక్రయించే వ్యాపా రులు అమాంతం పెంచేశారు. కొత్తగా దిగుమతి చేసుకున్న ఆయిల్ పైనే పెంచిన సుంకం అమలు చేయాలని చెబుతున్నా పాత స్టాకుపై వ్యాపా రులు అమలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. బ్రాండ్‌ను బట్టి రూ.100 నుంచి రూ.110 మధ్య ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు ప్యాకెట్‌ను రూ.138 లకు పెంచేశారు. రైస్ బ్రౌన్ ఆయిల్‌ను రూ.130 చేశారు. పామాయిల్, సోయాబీన్ ఆయిల్స్‌ను లీటరుకు రూ.20 చొప్పున పెంచారు. పాత ధరలకే విక్రయించాలని అధికారులు స్పష్టం చేస్తున్నా ఏ ఒక్క వ్యాపారి పట్టించుకోవడం లేదు. వంట నూనె ప్యాకెట్‌పై ఎమ్మార్పీ ఉంటుంది. గతంలో రూ.100కు విక్రయించిన ప్యాకెట్‌పై ఎమ్మార్పీ రూ.160 వరకు ఉంటుంది. ఇప్పుడు దానిని చూపుతూ ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతూ సొమ్ము చేసుకుం టున్నారు. ఈ ఎమ్మార్పీ మాయాజాలాన్ని సంబంధిత అధికారులు అరి కట్టలేకపోతున్నారని సామాన్యులు పెదవి విరుస్తున్నారు.

రేపటి నుంచి పంచాయతీ సభ్యులకు శిక్షణ

ముదినేపల్లి, అక్టోబరు 5 : ముదినేపల్లి మండలంలోని 32 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు తొలి విడతగా ఈ నెల 7 నుంచి 10 వరకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో మొదటి బ్యాచ్‌కు, 9, 10 తేదీల్లో రెండో బ్యాచ్‌కు సాధారణ పాలన, ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994కు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ ఉప సర్పంచ్‌తోపాటు ఇద్దరు వార్డుసభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు. పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లే అవుట్లు, ప్లాన్ల నిబంధనలు, పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై పంచాయతీ సభ్యులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

చలసాని జయప్రదకు నివాళి

నూజివీడు టౌన్, అక్టోబరు 5: సీపీఐ నాయకురాలు చలసాని జయప్రద మూడో వర్ధంతిని నూజివీడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆదర్శాలకు అనుగుణంగా ఉన్నత విలువలతో ఆమె జమీందారీలపై చేసిన పోరాటాలు నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, నాయకులు చాట్ల పుల్లారావు, నిమ్మగడ్డ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

8న విజయవాడలో కౌలురైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 5 : కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జడ్పీ అతిథిగృహం ఆవరణలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. అప్పులు చేసి పెట్టు బడులు పెట్టారని, పెట్టుబడిదారులు, కౌలు రైతులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కౌలు రైతుల రాష్ట్ర సదస్సు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని చెప్పారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

ముసునూరు, అక్టోబరు 5: ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ముసునూరుకు చెందిన భారతీయ విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కొండేటి శౌరి ఎంపికయ్యారు. శనివారం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఎమ్మెల్సీ కె.యస్. లక్ష్మణరావు, ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బినేని శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా శౌరి అవార్డు అందుకున్నారు. మండల ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు శౌరికి అభినందనలు తెలిపారు.



ఉపాధ్యాయ దంపతులకు..

చాట్రాయి: మండలంలోని చనుబండ ఉషోదయ స్కూల్ కరస్పాండెంట్ డి. వెంట్రామయ్య, ప్రిన్సిపాల్ దివ్యవాణి దంపతులకు ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (డెమొక్రటిక్) ఆధ్వర్యంలో శనివారం జగ్గయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి : సంజీవరెడ్డి



కైకలూరు, అక్టోబరు 5: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. సంజీవరెడ్డి అన్నారు. శనివారం కైకలూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గం నుంచి కో-ఆర్డినేటర్ల నియామకంపై చర్చించారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని రానున్న రోజుల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు నోబుల్, కురేళ్ళ ఇస్సాక్, ఈదా పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

దంత ఆరోగ్యం ప్రదానం



నూజివీడు టౌన్, అక్టోబరు 5: దంతాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వ్యాధులు దూరంగా ఉంటాయని నవీన డెంటల్ కేర్ వైద్యుడు డాక్టర్ కె.రేవంత్ అన్నారు. నూజివీడు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దంత వైద్యంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ సీనియర్ సిటిజన్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, టూత్ పేస్ట్ అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, పలగాని పిచ్చయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్‌కు సత్కారం



కలిదిండి, అక్టోబరు 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన రాష్ట్ర కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను కలిదిండి మండలానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు శనివారం విజయవాడలో కలసి సత్కరించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, జనసేన మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్నబాబు, కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆటోమొబైల్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ముదినేపల్లి, అక్టోబరు 5 : పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు టెన్త్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలను సాంకేతిక ఉపాధ్యాయులు చేపట్టారు. హెచ్‌ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఒకేషనల్ కోర్సుల ట్రయినర్లు ఎల్. నాగమల్లేశ్వరరావు పెయ్యేరు ఆటోనగర్‌లో వివిధ ఆటో మొబైల్ సంస్థల్లో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, వాహనాల రూపకల్పనకు పాటించే అంశాలు, వాటి వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన అంశాలను కో-ఆర్డినేటర్ పి.సాయిరామ్ వివరించారు. పదవ తరగతి పూర్తయ్యే నాటికి వివిధ సాంకేతిక అంశాలపై అవగాహన కలిగి ఉన్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కో-ఆర్డినేటర్ తెలిపారు.

డ్రోన్ సర్వే లోపాలు సరిదిద్దాలని మంత్రికి వినతి



ముదినేపల్లి, అక్టోబరు 5 : వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో అమలు చేసిన అవగాహన లేని విధానాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. శనివారం మంత్రిని విజయవాడలో కలసి గత ప్రభుత్వం అమలు చేసిన భూముల డ్రోన్ సర్వే వల్ల పలు లోపాలు చోటు చేసుకున్నాయని రైతులు తమ భూములకు సంబంధించి కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్వే అనంతరం నమోదైన ఎల్‌పి నంబర్లలో పలువురు రైతుల భూములకు సంబంధించి ఆర్‌ఎస్ నంబర్లు ఉమ్మడిగా కనిపిస్తున్నాయని, దీని వల్ల భూముల క్రయవిక్రయాలకు, రుణాలు తీసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. ప్రతి రైతుకు ప్రత్యేకంగా ఎల్‌పి నంబర్ ఉండాలన్నారు. రీ సర్వే చేయించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు నరసింహారావు తెలిపారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ముసునూరు, అక్టోబరు 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ నాయకుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. శనివారం ముసునూరులో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా వారికి సభ్యత్వ కార్డులను చలసాని అందజేశారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షులుగా కోనేరు సురేష్ చంద్ర బెనర్జీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యాదర్శిగా చంగల వెంకటేశ్వరరావుతోపాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4 నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలి

ముసునూరు, అక్టోబరు 5: గుళ్ళపూడి పంచాయతీ పరిధిలో పేదలు సాగు చేసుకుంటున్న భూములపై 4 నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. శనివారం గుళ్ళపూడి సచివాలయం వద్ద సాగుదారులతో కలసి ధర్నా నిర్వహించి మాట్లాడుతూ సర్వే నెంబరు 182లో 570 ఎకరాల అటవీ భూమికి 1967లో 4 నోటిఫికేషన్‌ను జారీ చేశారని, ఈ భూముల్లో బడుగు, బలహీన వర్గాల వారు కొన్నేళ్ళుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం తొలగించి అర్హులైన సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ పథకం, పారిశుధ్య సమస్యలపై సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పామర్తి రామారావు, ఏసు, బోట్ల భలేరామయ్య, చిట్టిమాద బసవలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు అభినందన

ముదినేపల్లి, అక్టోబరు 5: ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును పలువురు ముదినేపల్లి టీడీపీ నాయకులు అభినందించారు. శనివారం విజయవాడలో జరిగిన కొనకళ్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలు, సింగరాయపాలెం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శొంఠి నాగరాజు, ముదినేపల్లి ఉపసర్పంచ్ ఈడే సుధాకర్, పలువురు టీడీపీ నాయకులు నారాయణరావును సత్కరించి అభినందించారు.

చాట్రాయి ఈవోపీఆర్డీగా విజయలక్ష్మి



చాట్రాయి, అక్టోబరు 5: చాట్రాయి ఈవోపీఆర్డీగా ఐ. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపులపాడు మండలం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న మురళీకృష్ణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయటంతో విజయలక్ష్మిని నియమించారు. ప్రజాప్రతినిదులు, అధికారులు, సిబ్బంది సహకారంతో గ్రామాలు అభివృద్ధికి చేస్తానని ఆమె అన్నారు.

ముసునూరు ఈవోపీఆర్డీగా సత్యనారాయణ



ముసునూరు, అక్టోబరు 5: ముసునూరు మండల ఈవోపీఆర్డీగా బసవరాజు అచ్యుత సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా కరప బదిలీపై వెళ్ళగా, ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న ఎస్వీ శ్రీనివాసరావు ముసునూరు ఈవోపీఆర్డీగా వచ్చారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుతం ఇక్కడ ఈవోపీఆర్డీగా ఉన్న శ్రీనివాసరావు కరప మండలం వెళ్ళగా అక్కడ నుంచి సత్యనారాయణ ముసునూరు బదిలీపై వచ్చారు.

కలిదిండి ఆర్ఐగా శ్యామల



కలిదిండి, అక్టోబరు 5: కలిదిండి ఆర్ఐగా ఎస్.శ్యామల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన విజయలక్ష్మి గుడివాడ బదిలీ అయ్యారు. వీఆర్వోలు, సిబ్బంది ఆర్ఐ శ్యామలకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

నాగమణికి వైద్యం అందేనా..?



ఆక్సిజన్ సిలిండర్‌తో ఉన్న నాగమణి

ఏలూరు క్రైం, అక్టోబరు 5 : ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు తమ కళ్ల ఎదుటే ప్రాణం పోతుందని తెలిసినా తమకు పట్టనట్టు వ్యవహ రించిన ఘటన శనివారం రాత్రి జరిగింది. కైకలూరు మండలం దేవిచింతపాడుకు చెందిన తానేటి నాగమణి కడుపునొప్పితో బాధపడుతూ ఏలూరు ఎస్ఆర్ పేటలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి రెండు నెలల క్రితం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు కణిత ఉందని ఆపరేషన్ చేశారు. అయితే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిన దగ్గర నుంచి ఆమె అనారోగ్యానికి గురైంది. ఆమెను మరో ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేసిన ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్ అయిందని, ఆపరేషన్ ఎక్కడ చేశారో అక్కడికే వెళ్లాలని సూచించారు. దీంతో ఆమెను తీసుకుని ఎస్ఆర్ పేటలోని ఆస్పత్రికి వచ్చారు. అక్కడ వైద్యులు ఆమెకు వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రి ఎదుటే ఆక్సిజన్ సిలిండర్‌తో రాత్రి 11.30 వరకు ఉంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమెకు జరిగిన వైద్యంపై ఆస్పత్రి వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. అర్ధరాత్రి వరకు అధికారుల విచారణ జరుగుతూనే ఉంది.

తల్లి మరణంతో నిందితులకు తాత్కాలిక బెయిల్

ముదినేపల్లి, అక్టోబరు 5 : ముదినేపల్లి మండలం ఊటుకూరులో గత నెల 7న జరిగిన పోసిన బాలకోటయ్య హత్య కేసులో నిందితులైన ముగ్గురు వ్యక్తుల తల్లి చనిపోవటంతో గుడివాడ సబ్ కోర్టు జడ్జి వారికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆమె చనిపోవటంతో కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేయగా, కేసులో నిందితులైన శివాజీ, శ్రీనివాసరావు, మహంకాళిరావులకు తాత్కాలిక బెయిల్ లభించింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన నిందితులను శనివారం అంత్యక్రియలు పూర్తయ్యాక తిరిగి కోర్టుకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ముసునూరు, అక్టోబరు 5: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతని కుటుంబీకులపై బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్ శనివారం కేసు నమోదు చేశారు. లింగపాలెం మండలం తోచిలక గ్రామానికి చెందిన దుబ్బాక రాజేష్‌కు, ముసునూరు మండలం చింతలవల్లికి చెందిన అనితకు 2006లో వివాహమైంది. కొంతకాలం నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్తతోపాటు అతని కుటుంబీకులు తనను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు పెడుతున్నట్టు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయకుమార్ తెలిపారు.

అన్నపూర్ణాదేవి నర్దింతుమమ్మా..



నూజివీడు టౌన్, అక్టోబరు 5: మాతా అన్నపూర్ణేశ్వరి అంటూ భక్తుల నినాదాలతో నూజివీడు కోట మహిషాసురమర్దిని ఆలయం మార్మోగింది. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. శరన్నవరాత్రుల్లో భాగంగా నూజివీడు కోట మహిషాసుర మర్దిని అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముసునూరు: ముసునూరు రైస్‌మిల్లు సెంటర్‌లో దుర్గమ్మ అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ భారీ అన్నసమారాధన జరిపింది. బలివే శ్రీ రాజరాజేశ్వరిని గాయత్రిగా అలంకరించారు. ఈవో సీతారామయ్య పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ముసునూరు, కొర్లకుంట, గోపవరం, అక్కిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు.

చాట్రాయి: అన్నపూర్ణగా దర్శనం ఇచ్చిన దుర్గాదేవిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. చాట్రాయి కనకదుర్గ ఆలయం, సి. గుడిపాడు, తుమ్మగూడెం, చాట్రాయి శివాలయాలు, దుర్గమ్మ విగ్రహాల పందిళ్ళు భక్తులతో సందడిగా మారాయి. కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గాయత్రిదేవిగా రుద్రభూమి దుర్గమ్మ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపాన రుద్రభూమి మధ్యలో ఉన్న స్వయంభు దుర్గమ్మవారు శనివారం గాయత్రి మాతగా దర్శనమిచ్చారు. ఉదయం విశేష పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసినట్లు ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ధాన్యలక్ష్మిగా శ్రీ శ్యామలాంబ

కైకలూరు: కైకలూరు శ్రీ శ్యామలాంబ ఆలయంలో ప్రతి రోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. శనివారం ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు కంతేటి రామలక్ష్మణనాగ వరప్రసాద్, అలివేలి ప్రసన్నకుమారి దంపతుల సహకారంతో అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. ఆరుగురు దంపతులు పాల్గొని చండీహోమం చేశారు. ఉభయ దాతల పూజల్లో 20 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి, భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. శ్రీశ్యామలాంబ అమ్మవారు ఆదివారం రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆవరణపూజ, లలితాసహస్ర నామ కుంకుమపూజ కార్యక్రమాలను దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు, శాంతి ప్రియ దంపతులు నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండవల్లి: మండవల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. లోకుమూడి దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన, చండీహోమం నిర్వహించా రు. చిన్నారులు నృత్య ప్రదర్శన పలువురుని విశేషంగా ఆకట్టుకుంది. దత్తాశ్రమానికి వడ్లాపు వెంకటేశ్వరరావు దంపతులు రూ.15 వేలు విలువ చేసే ఫ్యాన్లను బహూకరించారు. ఆశ్రమం ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయశంకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిదిండి: గుర్వాయిపాలెం దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వగా, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, కొండ బాబు పూజలు నిర్వహించారు. కలిదిండి, కోరుకొల్లు, వెంకటాపురం, పోతుమర్రు, చినతాడినాడ దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముదినేపల్లి: పెయ్యేరు ఏరియాలోని బంటుమిల్లి రోడ్డులో ఉన్న దుర్గమ్మ కాశీ అన్నపూర్ణగా భక్తులకు దర్శనమివ్వగా, మారగాని పూర్ణానంద దంపతులు పూజలు జరిపారు. దేవపూడిలోని శ్రీ విజయదుర్గాదేవిని అన్నపూర్ణగా అలంకరించి నిర్వాహకుడు దాసరి భగవాన్లు ఆధ్వర్యంలో పెండ్యాల సతీష్, రాజేష్, ఉల్లంకి నగేష్, కమిడి నరసింహారావు, దంపతులు పూజలు నిర్వహించారు. చేవూరుపాలెంలోని పరసా వారి అంకమ్మ, శ్రీహరిపురం రామాలయం, గురజ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లు పూజలందుకున్నారు.





గుర్వాయిపాలెంలో అన్నపూర్ణగా.. ఆగిరిపల్లి రుద్రభూమిలో గాయత్రిగా



శ్రీశ్యామలాంబ ఆలయంలో ఉభయదాతల పూజల్లో పాల్గొన్న భక్తులు